లలిత సుగుణజాల! తెలుగుబాల!

1.
తెనుగుదనమువంటి తీయందనము లేడు

తెనుగు కవులవంటి ఘనులు లేరు

తెనుగు తల్లి సాధుజన కల్పవల్లిరా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

2.
కష్టపెట్టబోకు కన్నతల్లి మనస్సు

నష్టపెట్టబోకు నాన్నపనులు

తల్లిదండ్రులన్నదైవసన్నిభులురా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

3.
దేశసేవకంటె దేవతార్చన లేదు

స్వార్ధపరతకంటె చావు లేదు

సానుభూతికంటె స్వర్గంబు లేదురా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

4.
అందమైన సూక్తి అరుణోదయంబట్లు

బాల మానసముల మేలుకొల్పు

సూక్తిలేని మాట శ్రుతిలేని పాటరా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

5.
రక్తిలేని యాట రాత్రి నిద్దురచేటు

భక్తిలేని పూజ పత్రిచేటు

నీతిలేని చదువు జీతాలచేటురా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

6.
వినయ, మార్జవంబు, నీరత్వ, మనుకంప

దీక్ష, సత్యసూక్తి, దేశభక్తి

మండనమ్ము లివ్వి మంచి విద్యార్థికి

లలిత సుగుణజాల! తెలుగుబాల!

7.
మదము, దొంగతనము, మంకుబుద్ధి, అసూయ

విసుగు, పిరికితనము, విరుగబాటు

సహజ వుణము లివ్వి చవట విద్యార్థికి

లలిత సుగుణజాల! తెలుగుబాల!

8.
మొరకువానితోడ సరసమాడుట రోత

పిరికిపంద వెంట నరుగ రోత

నీతిలేని వాని నేస్తంబు రోతరా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

9.
ఎద్దు నెక్కె శివుడు, గ్రద్ద నెక్కెను విష్ణు

హంస నెక్కె బ్రహ్మ అందముగను

బద్ధకంపు మొద్దు బల్లపై నెక్కెరా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

10.
బడికి నడువలేడు, పాఠాలు వినలేడు

చిన్నపద్య మప్ప జెప్ప లేడు

రాజురాజుబిడ్డరా నేటి విద్యార్థి

లలిత సుగుణజాల! తెలుగుబాల!

11.
పరమ సుందరంబు ఫలములు, సంసార

విష మహీజమునకు వెలయు రెండు

సాదుసంగమంబు, సత్కావ్యపఠనంబు

లలిత సుగుణజాల! తెలుగుబాల!

12.
అతిథిజనుల వీడి అభ్యాగతుల వీడి

దేవతలకు నిడక తినెడివాని

చెప్పనగు ధరిత్రి "జీవస్మృతుం"డని

లలిత సుగుణజాల! తెలుగుబాల!

13.
జనులకొరకు ధర్మశాలలు గట్టించి
బీదసాద నెంతొ యాదరించి
పేరుగన్న కర్మవీరుడే "మ్రుతజీవి"
లలిత సుగుణజాల! తెలుగుబాల!

14.
హంసలందు బకము హాస్యాస్పదంబగు
మణుల గాజుపూస గణుతి గనదు
చదువురాని మొద్దు సభల రాణింపదు
లలిత సుగుణజాల! తెలుగుబాల!

15.
జవ్వసంబు గలిగి, సౌందర్యమును గల్గి,
కలిమి గలిగి, విద్య గనని జనులు
గంధరహిత కింశుకప్రసూనంబులు
లలిత సుగుణజాల! తెలుగుబాల

16.
బ్రతికినన్నినాళ్ళు ఫలము లిచ్చుటె గాదు
చచ్చికూడ చీల్చి యిచ్చు తనువు
త్యాభావమునకు తరువులే గురువులు
లలిత సుగుణజాల! తెలుగుబాల!

17.
జూలు చుటుకొన్న వాల మల్లార్చిన
కొండకొమ్ముమీద కూరుచున్న
కరుల గుండె లదర గర్జించునా నక్క
లలిత సుగుణజాల! తెలుగుబాల!

18.
తగిలినంతమేర దహియించుకొనిపోవు
చెడ్డవాని చెలిమి చిచ్చువోలె
మంచివాని మైత్రి మలయమారుత వీచి
లలిత సుగుణజాల! తెలుగుబాల!

19.
అది పయోధి దోష మడుగున మణు లిడి
త్రుణగణమ్ము తల ధరించు టనిన
మణుల విలువ పోదు త్రుణముల కది రాదు
లలిత సుగుణజాల! తెలుగుబాల!

20.
ఫణిని మట్టుపెట్టి బాలు గాపాడిన
ముంగి జంపె నొక్క మూర్ఖురాలు
మందమతుల కెపుడు ముందుచూ పుండదు
లలిత సుగుణజాల! తెలుగుబాల!

21.
సాధుసంగమమున సామాన్యుడును గూడ

మంచి గుణములను గ్రహించుచుండు

పుష్పసౌరభంబు బొందదా దారంబు

లలిత సుగుణజాల! తెలుగుబాల!

22.
అడవి గాల్చువేళ నగ్నికి సాయమై

నట్టి గాలి దీప మార్పి వేయు

బీదపడిన వేళ లేదురా స్నేహంబు

లలిత సుగుణజాల! తెలుగుబాల!

23.
మధుకరంబు వచ్చి మకరందమును ద్రావు

సరసిజంబు క్రింద తిరుగు కప్ప

కాంచలేరు జడులు కావ్య సౌందర్యంబు

లలిత సుగుణజాల! తెలుగుబాల!

24.
విరుల జేరి హరుని శిరసు నెక్కిన చీమ

చందమామతోడ సరస మాడె

ఉత్తమాశ్రయమున నున్నతస్థితి గల్గు

లలిత సుగుణజాల! తెలుగుబాల!

25.
నీట కుంజరమును నిలబెట్టు మొసలిని
బైట పిచ్చికుక్క పరిభవించు
స్థానబల మఖండ శక్తి ప్రదమ్మురా
లలిత సుగుణజాల! తెలుగుబాల!

26.
రావణుండు జనకరాట్పుత్రి గొనిపోవ
సింధువునకు గలిగె బంధనమ్ము
ఖలుని తప్పుచెంత గలవారలకు ముప్పు
లలిత సుగుణజాల! తెలుగుబాల!

27.
మద్యమునకు భ్రాంతి, మార్తాండునకు కాంతి,
క్షితికి క్షాంతి మందమతికి క్లాంతి,
సజ్జనులకు శాంతి సహజధర్మంబులు
లలిత సుగుణజాల! తెలుగుబాల!

28.
కొంప గాలు వేళ, గునపంబు చేబూని
బావి త్రవ్వ నేమి ఫలము గలుగు
ముందు చూపులేని మూర్ఖుండు చెడిపోవు
లలిత సుగుణజాల! తెలుగుబాల!

29.
ప్రాత దైన మాత్ర ప్రతిది సాధువు గాదు

క్రొత్తదనుచు విసరికొట్టరాడు

అరసి మంచిచెడ్డ సరసుండు గ్రహియించు

లలిత సుగుణజాల! తెలుగుబాల!

30.
పాలకడలిలోన ప్రభవించు మాత్రాన

హాలహలము మధుర మగుట గలదె

కులము ననుసరించి గుణములు రావురా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

31.
రాజహంస వికచ రాజీవవని చేర

కాకి గూడు, గ్రద్ధ కాడు చేరు

ఎట్టి గుణమువారి కట్టి యాశ్రయ మబ్బు

లలిత సుగుణజాల! తెలుగుబాల!

32.
కోకిలమ్మ చేసికొన్న పుణ్యం బేమి

కాకి చేసికొన్న కర్మమేమి

మధుర భాషణమున మర్యాద ప్రాప్తించు

లలిత సుగుణజాల! తెలుగుబాల!

33.
కాకి కోకిలమ్ము లేక వర్ణమ్ములే

సుంత తెలియదయ్యె నంతరంబు

గుట్టు బైటపడియె గొంతెత్తినంతసే

లలిత సుగుణజాల! తెలుగుబాల!

34.
పైడి గద్దెమీద పట్టంబు కట్టిన

సిగ్గులేని కోతి మొగ్గలేసె

అల్పమతికి పదవి హాస్యాస్పదంబురా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

35.
కొలిమి నిడిన, సాగగొట్టిన నరికిన

కంచన మ్మొకింత కష్టపడదు

కుందనంబు కుందు గురిగింజతో తూయ

లలిత సుగుణజాల! తెలుగుబాల!

36.
మూడు దశలు విత్తమునకు-దానమ్ము, భో

గమ్ము మరియు నాశన మ్మనంగ

మొదటి రెండు లేమి మూడవ దశ వచ్చు

లలిత సుగుణజాల! తెలుగుబాల!

37.
పెట్టెనిండ కూడబెట్టిన సిరులకు

తగిన రక్షణమ్ము త్యాగ గుణము

అలుగు పారి చెరువు జలముల కాపాడు

లలిత సుగుణజాల! తెలుగుబాల!

38.
ముందువెనుక గనుము, తొందరపడకుము

ఆపదలకు మౌఢ్య మాస్పదమ్ము

అరసి చేయువాని వరియించు సంపదల్

లలిత సుగుణజాల! తెలుగుబాల!

39.
అరుగుకొలది సురభియగును చందనయష్టి

తరుగుకొలది రసము గురియు చెరకు

ఘనులు ప్రక్రుతి విడరు కష్టాలలో గూడ

లలిత సుగుణజాల! తెలుగుబాల!

40.
ఇనుడు వెలుగు నిచ్చు ఘనుడు వర్షము నిచ్చు

గాలి వీచు చెట్లు పూలుపూచు

సాధుపుంగవులకు సహజలక్షణ మిది

లలిత సుగుణజాల! తెలుగుబాల!

41.
చిన్ననాటి చెలిమిచే నారికేళంబు

మధురజలము లొసగు మానవులకు

నరులమేలు ఘనులు మరువరు బ్రతు కెల్ల

లలిత సుగుణజాల! తెలుగుబాల!

42.
మదము గురియుచున్న మత్తేభముల పైన

సింహశిశువు దుమికి చీల్చివైచు

వరపరాక్రములకు వయసుతో పనిలేదు

లలిత సుగుణజాల! తెలుగుబాల!

43.
హస్తిరాజ మెంత హరికిశోరం బెంత

గహన మెంత అగ్నికణ మదెంత

దేహయష్టి కాదు తెజస్సు ముఖ్యంబు

లలిత సుగుణజాల! తెలుగుబాల!

44.
వీడు పరులవాడు వాడు నావాడని

అల్పబుద్ధి తలచు నాత్మయందు

సాధుపుంగవులకు జగమే కుటుంబంబు

లలిత సుగుణజాల! తెలుగుబాల!

45.
నరుడు మెచ్చెనేని నారాయణుడు మెచ్చు

దీనులందు దెవ దేవు డుండు

మానవార్చనంటె మాధవార్చనమురా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

46.
క్రౌంచపక్షి బాధ గన్న వాల్మీకిలో

కరుణరసము పొంగి పొరలిపోయె

రసము పొంగి పొంగి రామాయణంబయ్యె

లలిత సుగుణజాల! తెలుగుబాల!

47.
బాదరాయణుండు భారతమ్మును జెప్ప

గంట మూని వ్రాసె గజముఖుండు

ఘనత గన్న కవికి గట్టి వ్రాయసకాడు

లలిత సుగుణజాల! తెలుగుబాల!

48.
గౌతమీ తరంగణీ తరంగములకు

తెలుగు భంగిమములు తెలిపినాడు

ఆంధ్ర కవుల కెల్ల అన్నయ్య "నన్నయ్య"

లలిత సుగుణజాల! తెలుగుబాల!

49.
హోమవేది ముందు సోమయాజియె గాని
చేయి దిరిగినట్టి శిలిపి యతడు
"తిక్కనార్యు" పల్కు తియ్యదేనెలు చిల్కు
లలిత సుగుణజాల! తెలుగుబాల!

50.
స్నిగ్ధకావ్యరసము సీసాలలో నింపి
రసిక శెఖరులకు నొసగినాడు
సిద్ధహస్తుడోయి "శ్రీనాథకవిరాజు"
లలిత సుగుణజాల! తెలుగుబాల!

51.
భాగవతము వ్రాసె బమ్మెర పోతన్న
సహజ పాండితీ విశారదుండు
పలుకుపలుకులోన నొలికెరా ముత్యాలు
లలిత సుగుణ జాల! తెలుగుబాల!

52.
కలము చేతబట్టి కావ్యమ్ము రచియించె
హలము చేతబట్టి పొలము దున్నె
కలము హలములందు ఘనుండురా "పోతన్న"
లలిత సుగుణ జాల! తెలుగుబాల!

53.
ఖడ్గమూని శత్రుకంఠాలు ఖండించె

'గంట' మూని వ్రాసె కావ్యములను

"తెలుగు సవ్యసాచి" మన క్రుష్ణరాయుడు

లలిత సుగుణ జాల! తెలుగుబాల!

54.
అష్టదిగ్గజముల నాస్థానమున నిల్పి

రాజ్యమేలె క్రుష్ణరాయ విభుడు

తుంగభద్ర నాడు పొంగులెత్తినదిరా

లలిత సుగుణ జాల! తెలుగుబాల!

55.
పల్లె పైరుగాలి పరిరంభణమ్ములు

స్నిగ్ధమధుర వాగ్విజ్రుంభణములు

పాండురంగవిజయు పదగుంభనమ్ము

లలిత సుగుణ జాల! తెలుగుబాల!

56.
"రామలింగ" డంచు "రామక్రుష్ణుం" డంచు

జుట్టు జుట్టు పట్టి కొట్టుకొనిరి

లింగ క్రుష్ణులందు లేదురా భేదంబు

లలిత సుగుణ జాల! తెలుగుబాల!

57.
ఐనవారి నెల్ల అవహేళనము చేసి

కానివారితోడ కలియరాదు

కాకి, కేకులందు కలిసి కష్టము లందె

లలిత సుగుణ జాల! తెలుగుబాల!

58.
పొంచి, బుజ్జగించి, పొగడి టక్కరిమూక

మంచివారి మోసగించుచుండు

కాకి జున్ను ముక్క కాజేసెరా నక్క

లలిత సుగుణ జాల! తెలుగుబాల!

59.
సాటివానితోడ జగడమాడగరాదు

తీరువులకు పరులు జేరరాదు

కొంటెకోతి గడ్డకొట్టె పిల్లులనోట

లలిత సుగుణ జాల! తెలుగుబాల!

60.
ఆశపోతువాని కానంద మది కల్ల

ఆపదలకు లోభమాకరమ్ము

పసిడికంకణమ్ము బ్రాహ్మణు వంచించె

లలిత సుగుణ జాల! తెలుగుబాల!

61.
బావినీటిలోన ప్రతిబింబమును చూసి

సింహమును శశంబు సంహరించె

తగు నుపాయ మున్న తప్పు నపాయంబు

లలిత సుగుణ జాల! తెలుగుబాల!

62.
రత్నమాల పుట్ట రంధ్రాన పడవైచి

కాకి త్రాచుపాము గర్వ మడచె

పరుల నిట్లు యుక్తిపరులు సాధింతురు

లలిత సుగుణ జాల! తెలుగుబాల!

63.
మదగజమ్ము వీడి, మనుజుని పోనాడి,

నక్క చచ్చె వింటినారి కొరికి

హాని సంభవించు నతిసంచయేచ్ఛచే

లలిత సుగుణ జాల! తెలుగుబాల!

64.
తనకు తగని పిచ్చిపనులకు పోనేల

అడుసు త్రొక్కి కాలు కడుగుటేల

కోతి మేకు పీకి కోల్పోయె ప్రాణాలు

లలిత సుగుణ జాల! తెలుగుబాల!

65.
కష్టసాధ్యమైన కార్యమ్ము నెరవేర్ప
నైకమత్యమే మహాబలమ్ము
పావురములు వలను పైకెత్తుకొని పోపె
లలిత సుగుణ జాల! తెలుగుబాల!

66.
"కందుకూరి" "పానుగంటి" "కొమర్రాజు"
"చిలకమర్తి" "గిడుగు" "చెళ్ళపిళ్ళ"
తెలుగు దిగ్గజములు "చిలుకూరి" "వేదము"
లలిత సుగుణ జాల! తెలుగుబాల!

67.
కలిమి గలుగ నేస్తకాండ్రు వేలకు వేలు
కలిమి లేక చెలిమికాండ్రు లేరు
లేమివేళ మిత్రులే ప్రాణమిత్రులు
లలిత సుగుణ జాల! తెలుగుబాల!

68.
భారతం బనంగ పంచమ వేదంబు
దాత యనగ తొమ్మిదవ గజంబు
ధరణి నల్లుడన్న దశమగ్రహంబురా
లలిత సుగుణ జాల! తెలుగుబాల!

69.
ఆటలాడబోకు మల్లరి జట్టుతో

వేటలాడఓకు వెర్రి ప్రజల

మాటలాడబోకు మర్యాద విడనాడి

లలిత సుగుణ జాల! తెలుగుబాల!

70.
వెతకి వెతకి వారి వీరి కావ్యాలలో

గతికి గతికి కడుపు కక్కురితికి

అతుకు లతుకు కుకవి బ్రతుకేమి బ్రతుకురా

లలిత సుగుణ జాల! తెలుగుబాల!

71.
కలము పట్టగానె కవిశేఖరుడు గాడు

గద్దె నెక్కగానె పెద్ద గాడు

శాటి గట్టగానె సన్యాసి గాడురా

లలిత సుగుణ జాల! తెలుగుబాల!

72.
కట్టుకొన్న సతిని నట్టేటిలో ముంచి

కన్నవారి నోట గడ్డకొట్టి

సభలకెక్కువాడు చచ్చు పెద్దమ్మరా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

73.
బోసితాత శాంతి, బోసు వీరుని క్రాంతి,

త్యాగధనుల శోణిత స్రవంతి

భరతమాత దాస్యబంధాలు బాపెరా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

74.
నదులయందు గంగ, ననలందు సంపెంగ,

సతుల సీత, గ్రంథతతుల గీత,

కవులయందు గొప్ప కాళిదాసుండురా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

75.
ధనము గలుగుచోట ధర్మంబు కనరాదు

ధర్మ మున్నచోట ధనము లేదు

ధనము ధర్మ మున్న మనుజుండె ఘనుడురా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

76.
ధనము గలిగి దాన ధర్మాలు చేయని

నరుడు ధరణి కెంతొ బరువు చేటు

సాగరములు గావు శైలంబులును గావు

లలిత సుగుణజాల! తెలుగుబాల!

77.
ప్రాకిప్రాకి చీమ బహుయోజనము లేగు
ఎగురకున్న గ్రద్ద యెచటి కేగు?
సాధనమున కార్యసాఫల్య మొనగూడు
లలిత సుగుణజాల! తెలుగుబాల!

78.
మంచిచెడ్డ లేదు, మర్యాద కనరాదు,
దేవులాట కడుపు తిండి కొరకు,
పశువు, పురుషపశువు ప్రాణబంధువులురా
లలిత సుగుణజాల! తెలుగుబాల!

79.
విశ్వమందు గలుగు విషరాజములయందు
అతిభయంకరంబు హాలహలము
ఘోర మంతకంటె క్రూరుని చిత్తమ్ము
లలిత సుగుణజాల! తెలుగుబాల!

80.
మెదడు పాడుచేయు, మేనెల్ల చెడగొట్టు,
కీర్తి నపహరించు, నార్తి పెంచు,
క్రూరజనుల మైత్రి కుష్ఠురోగమ్మురా
లలిత సుగుణజాల! తెలుగుబాల!

81.
తక్షకునకు విషము దంష్ట్రాగ్రమున నుండు

మక్షికమున కుండు మస్తకమున

నీచునకు విషంబు నిలువెల్ల నుండురా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

82.
సత్ప్రవర్తనంబు, సౌఖ్యంబు, మర్యాద,

మంచివారి పొందు మనకు నిచ్చు

కలుషమతుల పొందు కలహాలు గొనితెచ్చు

లలిత సుగుణజాల! తెలుగుబాల!

83.
తరువులకు తుపాను, గిరులకు వజ్రమ్ము

పద్మములకు హిమము భయము గొల్పు

సజ్జనులకు దుష్టసంగంబు భయమురా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

84.
సమయ మెపుడు గడచు సన్మార్గులకు శాస్త్ర

చర్చలందు బుధసమర్చలందు

ఖలుల కాల మేగు కలహాల జూదాల

లలిత సుగుణజాల! తెలుగుబాల!

85.
మనసు, మాట, క్రియ సమైక్యమ్ములగు శిష్ట

మానవులకు, దుష్ట మానవులకు

తలపు వేరు, భాషితము వేరు, క్రియ వేరు

లలిత సుగుణజాల! తెలుగుబాల!

86.
మాంద్య మెల్ల దీర్చు, మంచి పేరు వెలార్చు

మనసు కలక దేర్చు, ఘనత కూర్చు

సాధుమైత్రి సకల సౌభాగ్య సందాత్రి

లలిత సుగుణజాల! తెలుగుబాల!

87.
నష్ట మధికమైన, కష్టాలు కలిగిన,

సిరి తొలంగి చనిన, మరణమైన,

ధర్మపథ మొకింత తప్ప రుత్తమజనుల్

లలిత సుగుణజాల! తెలుగుబాల!

88.
మదముచేత వెలుగు మత్తేభరాజంబు

జవముచేట వెలుగు సైంధనంబు

వినయగుణముచేత విద్యార్థి వెలుగురా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

89.
అంతరిక్షమునకు అర్కుండు రత్నంబు
భవనమునకు ముద్దు బాలకుండు
చదువుకొన్నవాడు సభకు రత్నంబురా
లలిత సుగుణజాల! తెలుగుబాల!

90.
ప్రభువు పూజలందు పట్టణమ్మందున
రాజు పూజలందు రాజ్యమందు
చదువుకొన్న వాని జగమెల్ల పూజించు
లలిత సుగుణజాల! తెలుగుబాల!

91.
దొరలు దోచలేరు, దొంగ లెత్తుకపోరు
భ్రాత్రుజనము వచ్చి పంచుకోరు
విశ్వవర్ధనంబు విద్యాధనంబురా
లలిత సుగుణజాల! తెలుగుబాల!

92.
తల్లివోలె పెంచు, తండ్రి కైవడి గాంచు,
కాంత కరణి మిగుల గారవించు
ఖ్యాతి మించు విద్య కల్పవృక్షంబురా
లలిత సుగుణజాల! తెలుగుబాల!

93.
నలువ కాగ్రహంబు గలిగిన వెలిపేయు

హంస నబ్బవ విహారమునకు

క్షీరనీరభేద శేముషిం జెరచునా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

94.
పరులకొరకె నదులు ప్రవహించు, గోవులు

పాలు పిండు, చెట్లు పూలు పూచు,

పరహితమ్ముకంటె పరమార్థ మున్నదా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

95.
కోరబోకు మెపుడు మేరమీరిన కోర్కె

చేరబోకు మెపుడు క్రూరజనుల

మీరబోకు పెద్దవారు చెప్పినమాట

లలిత సుగుణజాల! తెలుగుబాల!

96.
ప్రార్థనముల, పుణ్యతీర్థంబులందున,

గురులయందు, వైద్య వరులయందు,

భావమెట్టి దట్టి ఫలితంబు ప్రాప్తించు,

లలిత సుగుణజాల! తెలుగుబాల!

97.
ఆకసమున మిత్రు డరుదెంచి నంతసే
సరసిలోని నళిని శిరసు నెత్తు
అమలమైన మైత్రి కవరోధములు లేవు
లలిత సుగుణజాల! తెలుగుబాల!

98.
సాదుజనుల మానసము నారికేళంబు
పైన మిగుల గట్టి, లోన మ్రుదువు
బాలిశుల మనమ్ము బదరీ ఫలమ్మురా
లలిత సుగుణజాల! తెలుగుబాల!

99.
మనసు, మధుకరంబు, మద్యంబు, మత్స్యంబు,
మదము, మర్కటంబు, మారుతంబు
చంచలంబు లివ్వి, సప్తమకారముల్
లలిత సుగుణజాల! తెలుగుబాల!

100.
జనని, జన్మభూమి, జనకుండు, జాతీయ
కేతనంబు, జాహ్నవీతటంబు
పరమపావనములు పంచ జకారముల్
లలిత సుగుణజాల! తెలుగుబాల!